క్లుప్తంగా

ఆలిండియా రగ్బీ పోటీలకు విద్యార్థి ఎంపిక


పోతిరెడ్డి

ధర్మవరం అర్బన్: ఆలిండియా రగ్బీ పోటీలకు ధర్మవరంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి పోతిరెడ్డి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో విద్యార్థిని అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గత నెల 10న ఎస్కేయూలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన పోతిరెడ్డి ఎస్కేయూ జట్టుకు ఎంపికయ్యాడన్నారు. ఈ నెల 17 నుంచి పంజాబ్‌లోని యూనివర్సిటీ చండీఘర్‌లో ప్రారంభమయ్యే ఆలిండియా రగ్బీ పోటీలకు ఎస్కేయూ జట్టు తరపున పోతిరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తాడన్నారు. జాతీయస్థాయి పోటీల్లోనూ రాణించాలని ప్రిన్సిపాల్‌తోపాటు పీడీ ఆనంద్, అధ్యాపకులు అభినందించారు.

ఓంకారేశ్వరునికి ఆరుద్ర నక్షత్ర అభిషేకాలు


విశేష పూజలందుకుంటున్న ఓంకారేశ్వరుడు

బత్తలపల్లి: మండల కేంద్రంలోని లలితా త్రిపుర సుందరి సమేతా ఓంకారేశ్వరుని ఆలయంలో సోమవారం తెల్లవారుజామున ఆరుద్ర నక్షత్రంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించినట్లు ప్రధాన అర్చకులు కేశవస్వామి తెలిపారు. సోమవారం మృగశిర నక్షత్రం పార్వతీదేవి నక్షత్రం కావడంతో పరమశివునికి ఇష్టమైన మాసమని పేర్కొన్నారు. వంద కార్తీక మాసాలు శివున్ని అర్చిస్తే ఎంత అయితే ఫలితమో.. మార్గశిర మాసంలో వచ్చే ఆరుద్ర నక్షత్రం శివార్చన, శివనామస్మరణ, శివాభిషేకం, శివనామ స్మరణ చేస్తే శతాధిక ఫలితాన్ని మనకు లభిస్తుందని వివరించారు.

ధనుర్మాస పూజలు

చెన్నేకొత్తపల్లి: మండలంలోని పలు వైష్ణవ దేవాలయాల్లో సోమవారం ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామి మూల విరాట్‌కు పంచామృతాలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం స్వామిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. వేకువజామునే భక్తులు దేవాలయంలో స్వామిని దర్శించుకుని పూజలు చేయించారు. నెల రోజుల పాటు దేవాలయంలో ధనుర్మాస పూజలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

భవానీశంకరునికి పూజలు

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని భవానీశంకర్ స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రఘునాథశాస్త్రి ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాభిషేకం, అష్ట మూలిక ద్రవ్యాలతో రుద్రాభిషేకం చేశారు.

'పరిశ్రమల ఏర్పాటుకు కట్టుబడి ఉన్నాం'

అమడగూరు: మండలంలో పరిశ్రమల ఏర్పాటుకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం రెవెన్యూ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌కు ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆర్డీఓ వెంకట సన్యాసి శర్మ, తహసీల్దార్ రామనాథరెడ్డి స్వీకరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డితో కలిసి ఎమ్మెల్యే సింధూరరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో 1100 ఎకరాలలో సైన్స్‌సిటీ ఏర్పాటు చేస్తామని, స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఎంపీడీఓ మునెప్ప తదితరులు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ల పంపిణీ


మారాలలో క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

పుట్టపర్తి: వైఎస్సార్‌సీపీ రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్లను మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం బుక్కపట్నం మండలంలోని పాముదుర్తి, కొత్తకోట, మారాల, కృష్ణాపురం, యాదాలంకపల్లి, గూనిపల్లి పంచాయతీల్లో పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచులు విజయభాస్కర్‌రెడ్డి, గంగమనాయుడు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

కనగానపల్లి: వర్షాభావ పరిస్థితుల్లో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ మండల కార్యదర్శి బాలరాజు విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ సీపీఐ, రైతు సంఘాల నాయకులు సోమవారం గ్రీవెన్స్‌లో అధికారులకు వినతి పత్రం అందజేశారు.


ఎస్‌ఎల్‌వీ మార్కెట్ ప్రధాన రహదారిపైనే చెత్త


కూరగాయల మార్కెట్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం


నేసేపేటకు వెళ్లే ప్రధాన రహదారిపై ఇలా..

గాడి తప్పిన పుర పాలన

ధర్మవరం పట్టణంలో స్వచ్ఛత కరువైంది. ప్రధాన రహదారుల్లో ఎక్కడ పడితే అక్కడ అపరిశుభ్రత కనిపిస్తోంది. మార్కెట్‌వీధిలో చెత్తాచెదారం కుళ్లి దుర్వాసన వస్తోంది. పన్నులు ముక్కుపిండి వసూలు చేసే మున్సిపల్ అధికారులు మౌలిక సదుపాయాల కల్పనలో విఫలమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- ప్రధాన వీధులు, రహదారులు చెత్తమయం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- సమస్యలతో పట్టణ ప్రజలు సతమతం


కూరగాయల మార్కెట్‌లో రహదారిపై..

ధర్మవరం అర్బన్: 'పుర' పాలన గాడి తప్పింది. ప్రతి వార్డులోనూ సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ధర్మవరం పట్టణంలో ప్రధాన రహదారులైన మార్కెట్‌వీధి, ఎస్‌ఎల్‌వీ మార్కెట్‌వీధి, ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు, కాలేజీ గ్రౌండ్, పీఆర్‌టీ వీధి, శివానగర్, దుర్గానగర్, రాజేంద్రనగర్, కొత్తపేట, గాంధీనగర్, పాత మున్సిపల్ కార్యాలయం ఇలా ఎక్కడ చూసినా చెత్త దిబ్బలు దర్శనమిస్తున్నాయి. ఇక వార్డుల్లోని పరిస్థితి చెప్పనక్కరలేదు. డ్రెయినేజీలను వారం రోజులైనా శుభ్రం చేయడం లేదు. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే ప్రధాన రహదారుల పక్కనే చెత్తాచెదారం పేరుకుపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పన్నుల వసూళ్లపై మాత్రమే శ్రద్ధ

మున్సిపాలిటీ పరిధిలోని 40 వార్డుల్లో ఇంటి పన్నులు, కొళాయి పన్నులు వసూలు చేయడంపై ప్రత్యేక శ్రద్ధ చూపించే అధికారులు చెత్తాచెదారం తొలగించడం, కాలువలు శుభ్రం చేయడం, రహదారులు నిర్మించడంపై ఎందుకు దృష్టి సారించరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పన్నులు కట్టించుకుని మౌలిక సదుపాయాలు కల్పించడంలో పూర్తిగా విఫలమవుతున్నారని విమర్శిస్తున్నారు.

మున్సిపాలిటీ : ధర్మవరం
వార్డులు : 40
జనాభా : 1.21 లక్షలు

రోడ్డుపైనే మురుగునీరు

పట్టణంలో ఎక్కడ చూసినా చెత్తాచెదారమే. శివారు కాలనీల్లో చూస్తే ఇళ్లలోని మురుగునీరు మొత్తం మట్టి రహదారులపై చేరుతోంది. చిన్నపాటి వర్షం వచ్చినా కాలనీలోని రహదారులన్నీ బురదమయంగా మారుతున్నాయి. అధికారులు స్పందించి ప్రజల సమస్యలను గుర్తించి కాలనీలో సీసీ రోడ్లు నిర్మించాలి.
– వెంకటేష్, సత్యసాయినగర్, ధర్మవరం

మౌలిక సదుపాయాలు మృగ్యం

ప్రధాన రహదారులతోపాటు శివారు కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేవు. కాలనీల్లో కాలువలు లేక మురుగునీరు రోడ్లపై పారుతోంది. ఇక ప్రధాన రహదారులపైనే చెత్తాచెదారం కుప్పలు కనిపిస్తున్నాయి. పన్నులు కట్టించుకునేందుకు ముందుకు వచ్చే మున్సిపల్ అధికారులు సమస్యలను తీర్చేందుకు ఎందుకు రావడంలేదు?
– లక్ష్మీనారాయణ, తేరుబజార్, ధర్మవరం

కృష్ణా జిల్లా భక్తుల 'స్తోత్ర కదంబం'


నామ సంకీర్తన చేస్తున్న భక్తులు

ప్రశాంతి నిలయం: పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన కృష్ణా జిల్లా సత్యసాయి భక్తులు సోమవారం ప్రశాంతి నిలయం సాయికుల్వంత్ సభా మందిరంలో 'స్తోత్ర కదంబం' పేరుతో నామ సంకీర్తన నిర్వహించారు. గణేషాష్టకం, సత్యసాయి అష్టోత్తర నామాంజలి, కృష్ణాష్టకం, హనుమాన్ చాలీసా పఠించారు.

సమాజహితంలో న్యాయ వ్యవస్థ భాగస్వామ్యం


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి రాకేష్

పుట్టపర్తి రూరల్: సమాజహితంలో న్యాయ వ్యవస్థ కూడా భాగస్వామ్యం వహిస్తుందని పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జి రాకేష్ పేర్కొన్నారు. న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా సోమవారం ఎనుములపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో భవిత పాఠశాల విద్యార్థులకు వైద్య శిబిరం నిర్వహించారు. మూగ, చెవుడు, ఆర్థోపెడిక్ తదితర రుగ్మతులకు వైద్య నిపుణులు చికిత్స చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి గంగిరెడ్డి, న్యాయవాదులు యదుభూషణ్, చంద్రశేఖర్, ప్రసాద్, భారతీరెడ్డి, డాక్టర్లు జ్యోత్స్న, చంద్రిక, భవ్య, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

బడి వయసులో పని వద్దు


చిన్నారుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ సోమశేఖర్

బత్తలపల్లి: తల్లిదండ్రుల నిరక్షరాస్యత, పేదరికం తదితర కారణాలు చిన్నారుల జీవితాలను బుగ్గిపాలు చేస్తున్నాయని ఎస్‌ఐ సోమశేఖర్ ఆందోళన వ్యక్తం చేశారు. బడిలో చదవాల్సిన వయసులో పనులకు పంపవద్దని సూచించారు. సోమవారం తెల్లవారుజామున బత్తలపల్లిలోని పలు దుకాణాలు, హోటళ్లు, మెకానిక్ షెడ్లు, ఇటుక బట్టీల వద్ద చిన్నారులు పనులు చేస్తున్నారా? భిక్షం అడుగుతున్నారా? అనే విషయాలను పరిశీలించారు. బాల కార్మికుల విముక్తి కోసం ×ఆపరేషన్ ముస్కాన్₹ కార్యక్రమాన్ని ఎస్‌ఐ సోమశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి తమ సిబ్బందితో చేపట్టారు. మాల్యవంతం శివారులో బ్రహ్మనాయుడు ఇటుకల బట్టీ వద్ద ఒడిషాకు చెందిన కొన్ని కుటుంబాలు అక్కడ ఉండి వారితో పాటు తమ పిల్లలు పని చేస్తుండడాన్ని గుర్తించారు. వారిని స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇకపై పనిలో పెట్టబోమని, చదివించుకుంటామని చెప్పి తల్లిదండ్రులు హామీ ఇచ్చి పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. అధికారులు మాట్లాడుతూ సమగ్ర బాలల అభివృద్ధి పథకం, బాలకార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టాలు, బాలల బీమా పథకం, అనియత విద్య విధాన పథకం లాంటివి ఎన్నో అమలు చేస్తున్నట్లు తెలిపారు. చిన్నారులను పనులకు పంపడం, భిక్షం ఎత్తించడం వంటివి చేయకూడదని హెచ్చరించారు. దుకాణదారులు కూడా పిల్లలను పనుల్లో ఉంచుకోకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ తిరుపాలు, హెడ్ కానిస్టేబుల్ ఓబిలేసు, కానిస్టేబుల్ జనార్దన్, అనిల్, ఆంజనేయులు, గోపాల్, మహిళా కానిస్టేబుల్ అశ్వని తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

22న ఉచిత వైద్య శిబిరం

ధర్మవరం రూరల్: రోటరీ క్లబ్ ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 22న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను సోమవారం పట్టణంలోని సాంస్కృతిక మండలిలో విడుదల చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు జయసింహ, కార్యదర్శి నాగభూషణ, క్యాంప్ చైర్మన్ రమేష్ బాబు మాట్లాడుతూ పేదలకు ఆరోగ్యం ప్రసాదించడమే రోటరీ క్లబ్ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు కృష్ణకాంత్‌రెడ్డి, సింధు, లోక్‌నాథ్, దివాకర్, పద్మ, తేజస్విని కిషోర్, దినేష్, కోశాధికారి సుదర్శన్ గుప్తా, రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దార్ అంపయ్య, గట్టు హరినాథ్, కొండయ్య, తిరుమల దాస్, నాగరత్న, నరేంద్రరెడ్డి, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా విజయ దివస్

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని పీవీఎస్ పాఠశాలలో సోమవారం ఘనంగా విజయ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల చైర్మన్ పీవీ నాయుడు మాట్లాడుతూ భారత సైనికుల ధైర్యసాహసాలు అనన్య సామన్యమన్నారు. సైనికులను ఆదర్శంగా తీసుకుని ధైర్యాన్ని, క్రమశిక్షణను అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరం

ముదిగుబ్బ: యాకర్లకుంటపల్లిలో సోమవారం జిల్లా పశుగణాభివృద్ధి సహకారంతో పశువులకు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. 32 పశువులకు గర్భకోశ వ్యాధి నిపుణులు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టీవీ సుధాకర్ గర్భకోశ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రామేశ్వరావు, ఎహెచ్‌ఏలు, జీఎంఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో కదిరి క్రీడాకారుడి ప్రతిభ


కాటం ఈశ్వరసాయి

కదిరి అర్బన్: ఢిల్లీలో జరిగిన 68వ నేషనల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బ్యాడ్మింటన్ పోటీల్లో కదిరికి చెందిన క్రీడాకారుడు కాటం ఈశ్వరసాయి ప్రతిభ కనబరిచాడు. ఈ పోటీల్లో రన్నరప్‌గా నిలిచాడు. ఇతడు ఎనిమిదో తరగతి చదువుతున్నాడు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

బత్తలపల్లి: మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీ శివారు నార్శింపల్లి చెరువు వద్ద పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి, తొమ్మిది మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.8,540 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని ధర్మవరం కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది సుదర్శన్‌నాయుడు, రామాంజనేయులు, జనార్దన్, సుధాకర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

తనకల్లు: మండల పరిధిలోని ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాలిక అదృశ్యమైంది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోపీ సోమవారం తెలిపారు.

మినీ గోకులాలు త్వరగా పూర్తి చేయండి

ధర్మవరం రూరల్: ఉపాధి హామీ నిధులతో చేపట్టిన మినీ గోకులాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఏపీడీ వెంకట చలపతి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం చిగిచెర్లలో నారాయణ స్వామి అనే పాడి రైతుకు చెందిన మినీ గోకులం షెడ్ నిర్మాణ పనులతో పాటు గ్రామంలో హార్టికల్చర్ ప్లాంటేషన్ కింద నాటిన మామిడి మొక్కలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ప్లాంటేషన్ సూపర్‌వైజర్ శంకర్, టెక్నికల్ అసిస్టెంట్ రాజశేఖర్, క్షేత్ర సహాయకులు హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

మీనాక్షమ్మకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న ఆర్.జె.రత్నాకర్ దంపతులు

పుట్టపర్తి రూరల్: భగవాన్ సత్యసాయి సోదరుడు ఆర్‌వీ జానకి రామయ్య సతీమణి మీనాక్షమ్మకు పలువురు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం జానకి రామయ్య ఘాట్ వద్ద ఆమె కుమారుడు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ దంపతుల ఆధ్వర్యంలో మీనాక్షమ్మ వర్ధంతి నిర్వహించారు. పుట్టపర్తికి చెందిన పలువురు ప్రముఖులు అమెకు ఘనంగా నివాళిలర్పించారు. కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటా సత్యనారాయణ, డీఎస్పీ విజయ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, కౌన్సిలర్లు చెరువు భాస్కర్‌రెడ్డి, కులశేఖర్‌రాజు, డాక్టర్ కిరణ్, సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ సభ్యులు కోటేశ్వర రావు, నాయకులు కడప రాజా, కత్తి రాజారెడ్డి, తోట్ల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ


మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి


సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

గాండ్లపెంట: ఎంపీడీఓ కార్యాలయంలో 2024–25 ఏడాదికి సంబంధించి గ్రామ పంచాయతీల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించడానికి అన్ని శాఖల సిబ్బంది, సర్పంచులు, సచివాలయ సిబ్బందికి రెండు రోజులపాటు నిర్వహించే శిక్షణ సోమవారం ప్రారంభమైంది. గ్రామాల్లో లక్ష్యాల సాధనకు ఎలాంటి ప్రణాళికలు సిద్ధం చేయాలో శాఖల వారీగా తెలియజేసి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి, ఈఓఆర్డీ సునిత, టీఓటీలు బాషా, సూర్యనారాయణ, ఉపేంద్రారెడ్డి, పద్మావతమ్మ, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

ఎన్‌పీకుంట: ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై ఈఓపీఆర్డీ మాధవరెడ్డి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందికి రెండో విడత శిక్షణ నిర్వహించారు. పేదరిక నిర్మూలన, ఆరోగ్యకరమైన గ్రామం, జీవనోపాధి కల్పన, సురక్షితమైన నీరు, అందరికీ విద్య, పరిశుభ్రత కలిగిన గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు తీసుకోవలసిన చర్యలపై శిక్షణ ఇచ్చారు.

పంచాయతీల సుస్థిర అభివృద్ధే లక్ష్యం

తాడిమర్రి: గ్రామ పంచాయతీల సుస్థిర ఆర్థిక అభివృద్ధే తమ లక్ష్యమని ఎంపీడీఓ వెంకట రంగారావు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన తొమ్మిది శాఖల అధికారులు, సచివాలయాల సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా ప్రజా ఆరోగ్యం, విద్య, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణ, ఉపాధిహామీ పనులు, వ్యవసాయం, మహిళల భద్రత తదితర తొమ్మిది లక్ష్యాల సాధనకు ప్రతి అధికారీ కృషి చేయాలన్నారు. అనంతరం పంచాయతీల సుస్థిర ఆర్థిక అభివృద్ధి లక్ష్యాల గురించి జిల్లా కేంద్రంలో ప్రత్యేక శిక్షణ పొందిన ఏవో రమాదేవి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ చంద్రమ్మ వివరించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ విజయశేఖర్ నాయుడు, పశు వైద్యాధికారి స్వర్ణలత, హెల్త్ సూపర్‌వైజర్ రామ్ కుమార్, ఏపీఓ సంజీవరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫమీద తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికలతోనే గ్రామాల అభివృద్ధి

బత్తలపల్లి: ప్రణాళికలు సిద్ధం చేసుకొని.. ఆ మేరకు పనులు చేపడితే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీఓ నరసింహనాయుడు పేర్కొన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజుల శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ క్రిష్టప్ప, ఏఓ శ్రీనివాసులు, మండలస్థాయి అధికారులు, సర్పంచులు, కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు, ఎనర్జీ అసిస్టెంట్‌లు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, వెటర్నరీ అసిస్టెంట్లు, వీఆర్‌ఓలు, విలేజ్ సర్వేయర్లు, ఏఎన్ఎంలు తదితరులు హాజరయ్యారు.

తలుపుల : మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలో భాగంగా సోమవారం ఎంపీపీ రఫినాయక్, ఎంపీడీఓ రామానాయక్ అధ్యక్షతన సర్పంచులు, సచివాలయ సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. 9 అంశాలపై సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ అంజినప్ప, తహసీల్దార్ రెడ్డిశేఖర్, వైద్యాధికారి అప్తాప్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి వనరులను పెంపొందించుకోవాలి

కనగానపల్లి: గ్రామాల్లో అభివృద్ధి వనరులను పెంపొందించుకునేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎంపీడీఓ అనిల్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో స్థానిక స్వపరిపాలనపై సచివాలయాల అధికారులకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ శిక్షణ తరగతుల్లో భాగంగా తొలిరోజు మండలంలోని ఆరు సచివాలయాల సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

జంప్‌రోప్ పోటీల్లో ఆశ్రమ విద్యార్థుల ప్రతిభ

నల్లమాడ: ఓడీ చెరువులో ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించిన ఐదవ రాష్ట్రస్థాయి జూనియర్ జంప్‌రోప్ చాంపియన్‌షిప్ పోటీల్లో నల్లమాడ ఎస్టీ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఎల్‌ఆర్‌ఎస్ ఈవెంట్‌లో జె.అర్జున్ నాయక్, జయంత్ నాయక్, భాస్కర్ నాయక్, రంజిత్ నాయక్ బంగారు పతకాలు సాధించారు. అలాగే 4ఇంటూ 30 సెకన్ల ఈవెంట్‌లో చరణ్‌లాల్ నాయక్, లిఖిత్ నాయక్, డబుల్ డెచ్ ఈవెంట్‌లో వివేక్‌కుమార్ నాయక్, గిరిధర్ నాయక్, సోమేష్‌నాయక్ బంగారు పతకాలు, మూడు నిమిషాల ఈవెంట్‌లో ఓ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. వీరు జనవరిలో రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో జరిగే జాతీయ స్థాయి జంప్‌రోప్ పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం సతీష్, వసతిగృహ సంక్షేమాధికారి సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

అట్టహాసంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గురువులతో పూర్వ విద్యార్థులు

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం సిద్దరాంపురం ఉన్నత పాఠశాలలో సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం అట్టహాసంగా నిర్వహించారు. 1987–88 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు నాటి గురువులు జూటూరు రామచంద్రారెడ్డి తదితరులను ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి ఇతోధికంగా తోడ్పాటునందిస్తామని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రిటైర్డు ఉపాధ్యాయుడు చెన్నకృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యూస్ విశ్రాంత ఉద్యోగి కృష్ణారెడ్డి, శంకర్‌నారాయణ, పూర్వ విద్యార్థులు హరినాథ్‌రెడ్డి, హనుమంతరెడ్డి, రియాజ్ బాషా, ప్రమీలమ్మ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేఎన్ పాళ్యంలో నేడు రెవెన్యూ సదస్సు

తాడిమర్రి: కేఎన్ పాళ్యంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూమి సరిహద్దులు, రస్తా, పట్టాదారు పాసుపుస్తకం, ఇళ్ల పట్టా తదితర సమస్యల పరిష్కారం కోసం అర్జీలు అందజేయవచ్చని సూచించారు.

న్యామద్దెలలో నేడు రెవెన్యూ సదస్సు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని న్యామద్దెల గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సురేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ గ్రామాల పరిధిలోని రైతులు భూ సమస్యలపై వినతి పత్రాలు అందజేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ధర్మవరం రూరల్: ఇంటర్మీడియెట్ విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం 'సంకల్ప 2025'లో భాగంగా జూనియర్ కళాశాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసినట్లు ప్రిన్సిపాల్ ప్రశాంతి తెలిపారు. ప్రతిభ ఆధారంగా విద్యార్థులను ఏ, బీ, సీ కేటగిరీలుగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో బీ, సీ కేటగిరీ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశామని చెప్పారు.